

రూ.లక్ష విరాళం


ఐ.పోలవరం: మురమళ్ల శ్రీ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి జంపన సుబ్బరాజు దంపతులు సోమవారం రూ.లక్ష విరాళం సమర్పించారు.



రూ.1,01,116 విరాళం

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదానానికి అయ్యల సోమయాజుల భాస్కర భవానీ శంకర్, శ్రీదేవి దంపతులు సోమవారం రూ.1,01,116 విరాళం సమర్పించారు.

డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజ్ నుంచి సోమవారం తూర్పు డెల్టాకు 4700,పశ్చిమ డెల్టాకు 7000క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భద్రాచలం వద్ద 29.30అడుగులకు నీటి మట్టం చేరింది.

న్యూస్‌రీల్

అరట్లకట్ట సర్పంచ్ నిధుల డ్రాయింగ్ అధికారం నిలిపివేత

కరప: అరట్లకట్ట గ్రామసర్పంచ్ గోపి సత్యవేణి డ్రాయింగ్ అథారిటీని ఆరు నెలలపాటు నిలిపివేస్తూ డీపీఓ విక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. ఉత్తర్వులను సర్పంచ్‌కు అందజేసినట్టు ఈఓపీ ఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. అరట్లకట్ట గ్రామపంచాయతీలో నిధులు దుర్వినియోగం అయ్యాయని, విచారణ జరిపి బాధ్యులైనవారిపై చర్యలు తీసుకోవాలని ఆగ్రామానికి చెందిన సోడగం సూరిబాబు కలెక్టర్, జిల్లాపంచాయతీ అధికారులకు ఈ ఏడాది జూన్‌లో ఫిర్యాదు చేశారు. డీపీఓ ఆదేశాల మేరకు ఈఓపీఆర్డీ జూన్ 15న విచారణ జరిపారు. సాధారణ నిధులు పంచాయతీ కరెంట్ అకౌంట్‌లో జమచేయకుండా సర్పంచ్ నిబంధనలకు విరుద్ధంగా వ్యక్తిగత అకౌంట్‌లో వేసుకున్నారని..బిల్లులు లేదా వోచర్లు లేకుండా రూ 2.27 లక్షలు ఖర్చుచేసినట్టు విచారణలో బయటపడింది. దీంతో గ్రామ సర్పంచ్ డ్రాయింగ్ అథారిటీని ఆరు నెలలు సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులిచ్చినట్లు ఈఓపీఆర్డీ తెలిపారు.

మహా ప్రసాదం స్వామీ

వేలంలో వినాయక లడ్డూకు రూ.1.62 లక్షలు



స్వామివారి 365 కిలోల లడ్డూ ప్రసాదం

పెద్దాపురం: స్థానిక ప్రధాన రహదారిలోని వినాయక ఆలయంలో నవరాత్ర ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. స్వామివారికి మండపేట స్వీట్‌మార్ట్ అధినేత, మహారాణి సత్రం మాజీ చైర్మన్ కనకాల సుబ్రహ్మణ్యేశ్వరరావు 365 కిలోల లడ్డూను సమర్పించారు. ఈ ప్రసాదానికి సోమవారం వేలం నిర్వహించగా రూ.1,62,900కు పెద్దాపురం కృష్ణా జ్యూయలర్స్ అధినేత సందక శ్రీను దక్కించుకున్నారు. ఈ ప్రసాదాన్ని పట్టణ ప్రజలకు పంపిణీ చేశారు.

మహా సంస్థానం హుండీ ఆదాయం రూ.33.61 లక్షలు



పిఠాపురం శ్రీపాదశ్రీవల్లభ సంస్థానంలో హుండీల ఆదాయం లెక్కిస్తున్న అధికారులు, భక్తులు

పిఠాపురం: స్థానిక శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానంలో స్వామివారికి హుండీల ద్వారా రూ.33,61,963 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ ఆర్.సౌజన్య తెలిపారు. దేవదాయ, ధర్మాదాయ శాఖ తనిఖీదారు వి.ఫణీంద్రకుమార్ ఆధ్వర్యంలో సోమవారం హుండీలను తెరిచి లెక్కించారు. సుమారు 200 రోజులకు హుండీల ద్వారా రూ.33,61,963 ఆదాయం వచ్చినట్టు ఈఓ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ రెడ్డెం జనార్దనరావు, ధర్మకర్తలు పైండా శ్రీరామచంద్రమూర్తి, చక్కా దత్త చలపతిరావు, ముమ్మిడి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య రథ చక్రాలు



- రోగులకు అపర సంజీవనిగా వాహన సేవలు
- విపత్కర వేళలో 108
- క్షేత్రస్థాయి వైద్య సేవల కోసం 104
- తల్లీ బిడ్డల సేవల కోసం 102
- మరణ వేదనలో ఉపశమనం 'మహాప్రస్థానం'
- గడచిన రెండేళ్లలో పెరిగిన వాహనాల సంఖ్య

కాకినాడ క్రైం: జిల్లాలో ఆరోగ్య సేవలు పేద నిరుపేద వర్గాలకు ఉన్నత స్థితిలో అందడంలో వాహనాల పాత్ర కీలకమైనది. వ్యక్తి జననం నుంచి మరణం వరకు ప్రతి సందర్భంలోనూ చక్రం కీలక పాత్ర పోషిస్తోంది. బాలింత నుంచి పుట్టిన బిడ్డ వరకు తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లు, ప్రమాదాలు, విపత్తుల్లో 108 అంబులెన్సు సేవలు, మారుమూలలల్లో, గిరిజన, పల్లెల్లో, కొండ కోనల్లో టూ వీలర్ అంబులెన్సులు, వైద్య ఆరోగ్య సలహాలు సూచనల కోసం 104 వాహనాలు, అంతిమ ఘడియల అంతంలో మహాప్రస్థానాలు... ఇలా ఒకటి కాదు రెండు కాదు జనబాహుళ్య ఆరోగ్య పరిరక్షణ కోసం వందలాది వాహనాలను ప్రభుత్వం సమకూర్చింది. అంతే కాక, వాటి నిర్వహణను సమర్థవంతంగా కొనసాగిస్తోంది.

మహాప్రస్థానం....

తమ వారి మరణం ఎంత కష్టాన్ని తెచ్చి పెడుతుందో ఏదో ఒక దశలో ప్రతి వారికీ అనుభవమే. అటువంటి బాధాతప్త క్షణాల్లో మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించడం ఓ క్లిష్టమైన ప్రక్రియ. పేద నిరుపేద, మధ్య తరగతి వర్గాలకు ఆర్థిక భారం కూడా అటువంటి స్థితిలో మహాప్రస్థానం సేవలు అనిర్వచనీయం. మృతదేహాన్ని వారి బంధువులు కోరిన చోట చేర్చుతుంది. అది ఇల్లే కావచ్చు లేదా శ్మశానమైనా కావచ్చు. ఇది పూర్తిగా ఉచిత సేవ. జిల్లా పరిధిలో కాకినాడ జీజీహెచ్లో ఈ సేవలు అందుబాటులో ఉన్నాయి. వ్యక్తి మృతి చెందిన తర్వాత బంధువుల కోరిక మేరకు స్టాఫ్ నర్సు మహాప్రస్థానం వాహన సేవలకు సిఫార్సు చేస్తారు. జిల్లా వ్యాప్తంగా ఈ వాహనాలు మొత్తం 7 ఉన్నాయి. గెంబలి గంగరాజు మహాప్రస్థానం వాహనాల నిర్వహణకు జోనల్ మేనేజర్‌గా వ్యవహరిస్తుండగా 9 మంది డ్రైవర్లుగా పనిచేస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



వివిధ వాహనాల ద్వారా ప్రభుత్వం ముఖ్యంగా పేద నిరుపేద వర్గాలకు మధ్య తరగతి కుటుంబీకులకు అందిస్తున్న సేవలు సద్వినియోగం చేసుకోవాలి. వివిధ వర్గాలకు తగిన రీతిలో వాహన సేవలను సిద్ధం చేశారు. వీటి నిర్వహణ కేవలం జిల్లా స్థాయిది కాదు. ప్రతి అంశాన్ని రాష్ట్ర వర్గాలకు నివేదిస్తాం. నాతో పాటు కలెక్టర్ పర్యవేక్షణ నిరంతరాయంగా ఉంటుంది. కేవలం తరలింపునకే కాదు. వాహనంలోని సౌకర్యాలకు సైతం ప్రభుత్వం పెద్ద పీట వేసింది. గతంలో ఏ నాడూ లేని రీతిలో వాహన సేవలు జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో వృద్ధి చెందాయి.

– డాక్టర్ నరసింహ నాయక్, డీఎంహెచ్‌వో

గడచిన ఆరు నెలల్లో...

108 అంబులెన్సు సేవలు పొందిన వారు	20,910
తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ద్వారా లబ్దిపొందిన గర్భిణులు	6158
104 వాహన సేవలు వినియోగించుకున్న వారు	6,87,960
వైద్య ఆరోగ్య పరీక్షలు చేయించుకున్న వారి సంఖ్య	8,81,572
ఈసీజీ సేవలు పొందిన వారు	12,759
హోస్ విజిట్ ద్వారా లబ్ది పొందిన రోగుల సంఖ్య	38220
మహాప్రస్థానం వాహనాల ద్వారా తరలించిన మృతదేహాల సంఖ్య	2251

మొత్తం వాహనాలు

108 వాహనాలు	: 23
104 వాహనాలు	: 35
102 వాహనాలు	: 30
మహాప్రస్థానం వాహనాలు	: 7

108



ఆపదలో పిలిస్తే పలికే అభయ హస్తంలా 108 అంబులెన్సు క్షతగాత్రులు, గర్భిణిలకు భరోసా ఇస్తోంది. జిల్లాలో ఈ వాహనాలు 23 ఉండగా, వాటిలో 16 జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాతే జిల్లాకు కేటాయించనవే. ఈ అంబులెన్సుల్లో మూడు రకాలు ఉన్నాయి. అవి నియోనాటల్, అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్ట్(ఏఎల్ఎస్), బేసిక్ లైఫ్ సపోర్టు (బిఎల్ఎస్) అంబులెన్సులు. నియోనాటల్ అంబులెన్సు జిల్లాలో ఒకటి ఉంది. 28 రోజుల వయసు లోపు శిశువులను ఈ అంబులెన్సులో ఆసుపత్రికి తరలిస్తారు. నియోనాటల్ వెంటిలేటరు, ఇంక్యుబేటర్లు, వార్మ్ బ్లాంకెట్,ఆక్సిజన్ సరఫరా ఈ అంబులెన్సులో ఉంటాయి. ఏఎల్ఎస్‌లో ఎలక్ట్రికల్ షాక్‌లు ఇచ్చే డీఫిబ్లేటర్, వెంటిలేటర్, ట్రాన్స్‌పోర్ట్ వెంటిలేటర్, ఆక్సిజన్ సౌకర్యం ఉంటుంది. బీఎల్ఎస్ అంబులెన్సుల్లో బీపీ పల్స్ రేట్ పరీక్షించే మానిటర్,సిరంజి ఇన్‌ఫ్యూజన్, వాల్యూమ్ ఇన్‌ఫ్యూజన్, ఆక్సిజన్ సరఫరా ఉంటుంది. ఈ వాహనాల్లో బాధితులకు సేవలు అందించేందుకు పైలెట్‌తో పాటు ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ లేదా బీఎస్సీ నర్సింగ్, బీఎస్సీ బీజెడ్‌సీ చేసిన సుశిక్షితులు లేదా జీఎన్ఎంలు ఉంటారు. జిల్లాలో యావత్ 108 అంబులెన్సుల సేవలను జిల్లా మేనేజర్ హోదాలో సీహెచ్. అవినాష్ సమీక్షిస్తున్నారు. 108 టోల్ ఫ్రీ నంబర్‌ను సెల్‌లో డయల్ చేసి ఈ సేవలు పొందవచ్చు.

104



సంచార వైద్య సేవల పేరుతో గత ప్రభుత్వ హయంలో నిర్వహించిన ఈ సేవల దశ దిశ ప్రస్తుతం పూర్తిగా మారిపోయింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు గత ప్రభుత్వ హయంలో ఈ వాహనాలు 14 మాత్రమే ఉంటే వైఎస్ జగన్ తమ ప్రభుత్వంలో కాకినాడ జిల్లాకే 35 వాహనాలు కేటాయించారు. అవి కూడా పూర్తి ఏసీ, జీపీఎస్ అనుసంధానిత వాహనాలు. ఈ వాహనాల్లో 33 రకాల వైద్య ఆరోగ్య పరీక్షల కోసం పరికరాలు ఉంటాయి. గ్రామీణ ఆరోగ్యానికి ఈ వాహనాల సేవలు అత్యంత ప్రాధాన్యమైనవి. ప్రతి నెల రెండు సార్లు ఈ వాహనాలు విలేజ్ హెల్త్ క్లీనిక్‌ల పరిధిలో సేవలందిస్తాయి. మెడికల్ క్యాంపులు నిర్వహిస్తారు. ఆ క్యాంపులకు స్థానిక పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్‌తో పాటు ఎంఎల్‌హెచ్‌పీ, హెల్త్ సూపర్‌వైజర్లు, ఆశా,అంగన్వాడీ కార్యకర్త, నర్సులు హాజరై సేవలందిస్తారు. ఈ బృందంలో 104 వాహనం డీఈవో, పైలెట్ కూడా ఉంటారు. గర్భిణిలు, వయో వృద్ధులు, అనారోగ్య స్థితిలో మంచానికి పరిమితం అయిన వారు, మానసిక వికలాంగులకు ఈ సేవలు ఒక వరం. అధునాతన ఈసీజీ సేవలు ఈ వాహనం ప్రత్యేకత. వైద్య పరీక్షలు నిర్వహించి, సమస్యకు అనుగుణంగా మందులు పంపిణీ చేయడంలో పాటు రోగి పరిస్థితిని బట్టి ఉన్నత ఆరోగ్యకేంద్రానికి సిఫార్సు చేస్తారని 104 జిల్లా మేనేజర్ కొజ్జరపు వీరబాబు తెలిపారు.

102



102 సేవలనే తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలు అంటారు. జిల్లాలో ఈ వాహనాలు 30 ఉన్నాయి. తల్లితో పాటు బిడ్డ సంరక్షణ ఈ వాహనాల విధి. ప్రసవించిన మహిళను తన బిడ్డతో గమ్యస్థానానికి చేర్చడమే ఈ వాహనాల విధిగా కొందరు భావిస్తారు. ఈ వాహనాలు బహుళ ప్రయోజనాలను చేకూరుస్తాయని జిల్లా కో ఆర్డినేటర్ పిరట్ల సురేష్ తెలిపారు. హైరిస్క్ ప్రెగ్నెన్సీలో వైద్యులు నిర్ధారించిన ప్రసవ తేదీకి మూడు రోజుల ముందుగానే వారి సూచనలతో గర్భిణినిని ఇంటి నుంచి ఆసుపత్రికి చేరుస్తారు. అధిక రక్తహీనత ఉన్న గర్భిణీలను గర్భధారణ సమయంలో వైద్యుల సూచనలమేరకు ఎన్ని సార్లు అయినా ఆసుపత్రికి తీసుకువెళతారు. రక్తం ఎక్కించాల్సిన సందర్భాల్లోనూ ఐరన్ సుక్రోజ్ ఇంజక్షన్‌కు ఇవ్వాల్సిన గర్భిణీలను ఇంటి నుంచి ఉచితంగా తీసుకువెళతారు. ఇవి పూర్తి ఏసీ వాహనాలనీ, జీపీఎస్‌తో అనుసంధానం అయి ఉంటాయని సురేష్ తెలిపారు. ఈ వాహనాలు అన్నింటినీ వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వమే కాకినాడ జిల్లాకు కేటాయించింది.

స్పందనలో అర్జీల పరిష్కారానికి పెద్దపీట

జిల్లా కలెక్టరు కృతికా శుక్లా



ప్రజల నుంచి అర్జీలను స్వీకరించిన జిల్లా కలెక్టరు, జాయింట్ కలెక్టరు, ఇతర అధికారులు

సామర్లకోట: స్పందన అర్జీలను నిర్ణిత గడువు లోపులో పరిష్కరించాలని కలెక్టరు కృతికా శుక్లా అన్నారు. ఈ కార్యక్రమాన్ని సీరియస్ గా తీసుకోవాలని అధికారులకు సూచించారు. సామర్లకోట గాంధీచౌక్ రైతు భవనంలో సోమవారం జగనన్నకు చెబుదాం(స్పందన) జిల్లా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం నియోజకవర్గ, మండల స్థాయిలో స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. వినతులు స్వీకరించే సమయంలో అర్జీదారులతో మర్యాదగా మాట్లాడాలని అధికారులకు సూచించారు. అర్జీలపై సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నివేదిక సమర్పించాలన్నారు. వివిధ శాఖల నుంచి రీ-ఓపెన్ అయ్యే దరఖాస్తులపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వేట్లపాలెం పంచాయతీలోని అవినీతి రుజువు కావడంతో రికవరీ చేసి దోషులను శిక్షించాలని ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు వినతి పత్రం సమర్పించారు. 13వ వార్డు నేతల హరిబాబు గత ప్రభుత్వ పాలనలో నిర్మించిన కల్యాణ మండపాలకు పార్కింగ్ సదుపాయాలు లేవని, అల్లూరి సీతారామరాజు పార్కు వద్ద అసంపూర్తిగా ఉన్న ఐసీడీఎస్ భవనాలను పూర్తి చేయాలని కోరారు. బార్‌లో 24 గంటలు మద్యం అమ్మకాల వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని 23వ వార్డు కౌన్సిలర్ సురేష్ ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ వసతి గృహాలలో బాలికలకు మెరుగైన సదుపాయాలు కల్పించాలని జిల్లా మానవహక్కుల సంఘ అధ్యక్షుడు నూతలపాటి అప్పలకొండ వినతి అందజేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఇళ్ల పట్టాలు, ఉపాధి అవకాశాలు, రెవెన్యూ సేవలు, సర్వే, పింఛన్లు, సర్వేలు, భూమి మంజూరు తదితర అంశాలపై 215 అర్జీలు వచ్చాయని డీఆర్వో కె. శ్రీధర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టరు ఎస్ ఇలక్కియ, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎస్‌వీ సుబ్బలక్ష్మి, కాకినాడ, పెద్దాపురం ఆర్డీఓలు ఎన్‌వీవీ సత్యనారాయణ, జె సీతారామరావు, డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి, జెడ్పీ సీఈఓ రమణారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ శ్రీరమణి, మెప్మా సీడీ ప్రియంవధ, దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ పులి నారాయణమూర్తి, వివిధ శాఖలకు చెందిన అధికారులు, ఎంపీడీఓ డి శ్రీలలిత, తహసీల్దార్ ఎస్ఎల్‌వీ కుమారి, మున్సిపల్ కమిషనర్ జె రామారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ

జేసీ ఇలక్కియ



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న జేసీ ఇలక్కియ

కాకినాడ సిటీ: జిల్లాలో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియ ప్రణాళికాబద్ధంగా చేపడుతున్నట్లు జేసీ ఇలక్కియ తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ కోర్టు హాలులో ఆర్డీఓ కె.శ్రీధర్‌రెడ్డి, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలతో కలసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రత్యేక సంక్షిప్త సవరణ-2024 పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ తదితర అంశాలపై చర్చించారు. పోలింగ్ కేంద్రాల పేరు మార్పు, స్థలం మార్పు, కొత్తవి ఏర్పాటు తదితరాలపై ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (ఈఆర్ఓ) నుంచి వచ్చిన ప్రతిపాదనలను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేసి, అభ్యంతరాలు, సలహాలు, సూచనలు కోరామన్నారు. అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి అందిన అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకొని కొత్తగా ప్రతిపాదనలు రూపొందించినట్లు వివరించారు. ప్రస్తుతం జిల్లాలో 1,634 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, కొత్తగా మరో మూడు కేంద్రాలను చేరుస్తూ ప్రతిపాదనలు రూపొందించామన్నారు. అదే విధంగా స్థల మార్పునకు 170, పేరు మార్పునకు 300 ప్రతిపాదనలను చేశామని వెల్లడించారు. వీటికి ముఖ్య ఎన్నికల అధికారికి పంపనున్నట్లు జేసీ వివరించారు. వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు రావూరి వెంకటేశ్వరరావు, సీహెచ్ రమేష్‌బాబు, గదుల సాయిబాబా, కె.వీరబాబు, ఎస్.అప్పారావు, ఎన్.శివలతో పాటు కాకినాడ, పెద్దాపురం ఆర్డీఓలు ఎన్‌వీవీ సత్యనారాయణ, జె.సీతారామారావు, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎస్‌వీఎస్ సుబ్బలక్ష్మి, కౌడా వైస్ చైర్మన్ సుబ్బారావు, కేఎస్ఈజెడ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.మనోరమ, కలెక్టరేట్ ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ఎం.జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పవిత్రోత్సవాలు



కల్యాణ మండపం వద్ద స్వామివారి ఉత్సవ మూర్తుల సేవలో ప్రముఖులు, అర్చకులు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో మూడో రోజైన సోమవారం కూడా స్వామివారి వార్షిక పవిత్రోత్సవాలు నిర్వహించారు. తొలుత స్వామివారి సన్నిధిలో విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనంతో మూడో రోజు ఉత్సవాలను ఆరంభించారు. అనంతరం స్వామివారి ఉత్సవమూర్తులను ఆలయం లోపల కల్యాణ మండపంలోని ప్రత్యేక వేదికపై వేంచేయించారు. పంచసూక్తాలతో హోమం, మహాశాంతి హోమం, మూలహోమం నిర్వహించారు. తదనంతరం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేసి, విశేష పూజలు చేశారు. ప్రధానార్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ ఆధ్వర్యాన స్థానాచార్య వింజమూరి రామ రంగాచార్యులు, వేద పండితుడు చింతా వేంకటశాస్త్రి, అర్చకులు ఈ ఉత్సవాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమార రామగోపాల రాజా బహద్దూర్, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, భక్తులు పాల్గొన్నారు.

వినరా భారత వీర కుమారా..

- దేశభక్తిని చాటేలా.. స్ఫూర్తి నింపేలా.. విద్యార్థులకు వీరగాథ 3.0 పోటీలు
- 30తో ముగుస్తున్న గడువు

రాయవరం: విద్యార్థుల్లో దేశభక్తిని నింపడంతో పాటు, వారిలోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు కేంద్ర విద్య, రక్షణ మంత్రిత్వ శాఖలు సంయుక్తంగా వీరగాథ 3.0 పోటీలు నిర్వహిస్తున్నాయి. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థులకు ఇప్పటికే ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. మూడో తరగతి నుంచి 12వ తరగతి (ఇంటర్మీడియెట్) వరకూ విద్యార్థులకు నాలుగు అంశాల్లో ఈ పోటీలు చేపడుతున్నారు. దేశం కోసం ప్రాణత్యాగాలు చేసిన వీరుల గాథలను వివరించడం, వారి త్యాగాలను తెలిపే విధంగా పద్యాలు, కథలు, చిత్రలేఖనం, వ్యాసరచన, మల్టీమీడియా ప్రదర్శన వంటి అంశాల్లో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు ఈ నెల 30వ తేదీ వరకూ గడువు ఉంది.

ఎంచుకోవాల్సిన అంశాలు

వీరగాథ 3.0 పోటీల్లో పాల్గొనే విద్యార్థులు తమకు నచ్చిన అంశాలను ఎంచుకోవచ్చు. దేశం కోసం అత్యున్నత త్యాగం చేసిన వారిని రోల్‌మోడల్‌గా ఎంచుకుని, వారి నుంచి నేర్చుకున్న విలువలను ప్రస్తావించాలి. తమకు అవకాశం వస్తే ఏం చేయదలచుకున్నారో చెప్పాలి. ఉదాహరణకు ఝాన్సీ లక్ష్మీబాయి కలలోకి వచ్చి, దేశానికి సేవ చేయాలని కోరితే ఏం చేస్తారో వివరించవచ్చు. 1857లో జరిగిన సిపాయిల తిరుగుబాటు, తాను ఆదర్శంగా తీసుకున్న స్వాతంత్ర్య సమరయోధుల జీవిత కథలు తనపై ఎలాంటి ప్రభావం చూపిందో చెప్పాల్సి ఉంటుంది. అలాగే స్వాతంత్ర్య పోరాటంలో గిరిజనుల తిరుగుబాటు, ఇతర అంశాలను కూడా ఎంపిక చేసుకోవచ్చు.

నాలుగు విభాగాల్లో పోటీలు

- ఈ పోటీలు పాఠశాలల వారీగా నాలుగు విభాగాలుగా నిర్వహిస్తున్నారు. 3-5, 6-8, 9-10, 11-12 తరగతుల వారిని వేర్వేరు కేటగిరీలుగా విభజించారు.
- 3-5 తరగతుల విద్యార్థులకు పద్యం, కథ (150 పదాలు), చిత్రలేఖనం, పెయింటింగ్.
- 6-8 తరగతుల వారికి పద్యాలు/కథ (300 పదాలు), చిత్రలేఖనం, పెయింటింగ్, మల్టీమీడియా ప్రదర్శన.
- 9-10 తరగతుల విద్యార్థులకు పద్యాలు, వ్యాసం (700 పదాలు), చిత్రలేఖనం, పెయింటింగ్, మల్టీమీడియా ప్రదర్శన.
- 11-12 తరగతుల వారికి పద్యాలు, వ్యాసం (1,000 పదాలు), చిత్రలేఖనం, పెయింటింగ్, మల్టీమీడియా ప్రదర్శన అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు.
- ఒకటి లేదా రెండు నిమిషాల నిడివితో దేశభక్తికి సంబంధించిన వీడియో రూపొందించడాన్ని మల్టీమీడియాగా పరిగణిస్తారు.



వీరగాథ 3.0 కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

ఈ నెల 21వ తేదీనాటికి జిల్లాల వారీగా వీరగాథ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

జిల్లా	పాల్గొన్న విద్యార్థులు
కాకినాడ	1,674
కోనసీమ	9,202
తూర్పు గోదావరి	81,969

నమోదు చేసుకోవాలిలా..

ఆయా పాఠశాలల విద్యార్థులకు ఉపాధ్యాయులు కేటగిరీల వారీగా, తరగతుల వారీగా పోటీలు నిర్వహిస్తున్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులకు పోటీలు నిర్వహించి, వారి వివరాలను ఇన్నోవేటివ్ ఇండియా.మైజీఓవీ.ఇన్/వీర్.గాథ 3.0 అనే వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి. సబ్‌మిట్ యువర్ ఎంట్రీ అని ఉన్న చోట క్లిక్ చేసి, వివరాలు నమోదు చేయాలి. ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాలల నుంచి అత్యుత్తమమైన నాలుగు ఎంట్రీలను అప్‌లోడ్ చేయాలి. మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ఉత్తమంగా ఎంపిక చేసిన వాటిని జాతీయ స్థాయికి పంపిస్తారు. జాతీయ స్థాయిలో ఒక్కో విభాగంలో 25 మంది చొప్పున అత్యుత్తమ ప్రతిభ చూపిన వారిని ఎంపిక చేసి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున నగదు పారితోషికం, ప్రశంసా పత్రం అందజేస్తారు. జిల్లావ్యాప్తంగా 2,030 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 2.04 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. ఆయా పాఠశాలల్లో తరగతుల వారీగా, కేటగిరీల వారీగా ఉపాధ్యాయులు ఇప్పటికే వీరగాథ 3.0 పోటీలు నిర్వహిస్తున్నారు.



జాతీయ స్థాయిలో ప్రతిభ చాటేలా..



విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించడమే కాకుండా, వారిలోని సృజనాత్మకతను వెలికితీసే చక్కటి కార్యక్రమం వీరగాథ 3.0. విద్యార్థుల ప్రతిభ జాతీయ స్థాయిలో మెరిసేలా ఉపాధ్యాయులు మార్గదర్శకత్వం చేయాలి. దేశభక్తిని చాటేలా.. వీరుల గాథలు విద్యార్థుల్లో స్ఫూర్తి నింపేలా పోటీలు నిర్వహించాలి.

– జి.నాగమణి, ఆర్‌జేడీ, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ

సద్వినియోగం చేసుకోవాలి



వీరగాథ 3.0 పోటీలను అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులూ సద్వినియోగం చేసుకునేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలి. ఈ పోటీల ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత బయటకు వస్తుంది. విద్యార్థులకు నిర్వహించిన పోటీలు, మల్టీమీడియా వీడియోలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి.

– ఎం.కమలకుమారి, అదనపు ప్రాజెక్టు కో ఆర్డినేటర్, సమగ్ర శిక్షా, అమలాపురం

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


సూర్యప్రభ


శ్రీసత్యవేణి

మలికిపురం/సఖినేటిపల్లి: రాష్ట్ర స్థాయి అండర్-14 వాలీబాల్ పోటీలకు ఇద్దరు విద్యార్థినులు ఎంపికయ్యారు. మలికిపురం మండలం గుడిమెళ్లంక, సఖినేటిపల్లి మండలం అంతర్వేదికర జెడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థినులు కొండా దేవీ సూర్యప్రభ, చెన్నంశెట్టి శ్రీసత్యవేణి ఈ ఘనత సాధించారు. అనపర్తిలో సోమవారం జరిగిన వాలీబాల్ పోటీల్లో పాల్గొన్న వారు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. సూర్యప్రభను ఆ పాఠశాల ఉపాధ్యాయులు, పెద్దలు అభినందించారు. శ్రీసత్యవేణిని, ఆమెకు శిక్షణ ఇచ్చిన పీడీ కె.భాస్కరరావును హెచ్‌ఎం సోమ సూర్యకుమారి, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ పోతురాజు నాగేంద్ర కుమార్, సర్పంచ్ పోతురాజు కిషోర్ తదితరులు అభినందించారు.

వ్యక్తి ఆత్మహత్య

సామర్లకోట: ఉరి వేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల కథనం ప్రకారం.. స్థానిక పెన్షన్ లైన్‌లో అద్దెకు ఉంటున్న రాజా (31) సోమవారం ఆత్మహత్యా యత్నం చేసుకుంటున్నట్టు చుట్టుపక్కల వారు గమనించారు. వెంటనే తలుపులు బద్దలుగొట్టి లోపలకు వెళ్లి, అతడిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే రాజా మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. మృతునికి ఏడాది క్రితం వివాహమైంది. భార్య ఇంట్లో లేని సమయంలో ఈ సంఘటన జరిగింది. ఎస్సై పీవీఆర్ మూర్తి సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పథకం పన్ని..
పసి మొగ్గను మట్టుబెట్టి..


హతురాలు మానస

- సాన్నిహిత్యానికి అడ్డంగా ఉందనే బాలిక హత్య?
- సమీప బంధువు ఘాతుకం!
- పరారీలో నిందితుడు
- గాలిస్తున్న పోలీసులు
- పట్టించిన వారికి రూ.10 వేల పారితోషికం


నిందితుడు నాని

పెద్దాపురం: తనను తీసుకువెళ్తున్నది మేకవన్నె పులి అని.. అభం శుభం తెలియని ఆ చిన్నారి మనస్సుకు అర్థం కాలేదు.. నిలువెల్లా కాపట్యం నిండిన ఆ క్రూరుడు తనను కబళించేస్తాడని ఏ మాత్రం అనుకోలేదు.. బంధువే కదా అనుకుంటూ ఆ దుర్మార్గుడిని నమ్మింది.. మాయ మాటలు విని, అతడితో వెళ్లింది.. చివరకు ఆ దౌర్భాగ్యుడి చేతుల్లో అత్యంత క్రూరంగా హతమారిపోయింది. పెద్దాపురం పట్టణంలో సంచలనం రేపిన బాలిక హత్యకు కారకుడిని పోలీసులు గుర్తించారు. నిందితుడి కోసం వేట మొదలుపెట్టారు. పోలీసుల కథనం ప్రకారం..


ధర్నా చేస్తున్న ఎన్‌టీఆర్ నగర్ వాసులు


ఆందోళనకారులతో చర్చిస్తున్న పోలీసులు

పెద్దాపురం కొండయ్యపేటకు చెందిన దంపతులు ద్రోణ వీర్రాజు, జ్యోతి కొన్నాళ్ల కిందట మనస్పర్థల కారణంగా విడిపోయారు. దీంతో జ్యోతి తన పదేళ్ల కుమార్తె ప్రవీణ కుమారి అలియాస్ మానస, తన తల్లి సునీతతో కలసి పట్టణ శివారులోని ఎన్‌టీఆర్ నగర్‌లోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటోంది. రంగంపేట మండలం వడిశలేరుకు చెందిన బత్తిన నాని జ్యోతికి సమీప బంధువు. వరుసకు మేనల్లుడు అవుతాడు. ఐదేళ్లుగా వీరిద్దరి మధ్య సాన్నిహిత్యం ఏర్పడి, కొనసాగుతోంది. అయితే, తన కుమార్తె ఎదుగుతోందని, ఇంటికి రావడం సరి కాదని అంటూ కొన్నాళ్లుగా నానిని జ్యోతి దూరం పెడుతోంది. అది తట్టుకోలేని నాని తమ సాన్నిహిత్యానికి అడ్డంగా ఉన్న మానసను మట్టుబెట్టాలని నిర్ణయించుకున్నాడు. దీనికి ప్రణాళిక సిద్ధం చేశాడు. అందులో భాగంగా బయటకు తీసుకువెళ్తానని ఈ నెల 19వ తేదీన మానసకు చెప్పాడు. బంధువే కావడంతో అతడి మాటల్ని ఆ బాలిక నమ్మింది. మానసను తన బైక్‌పై ఎక్కించుకున్న నాని, స్థానిక కట్టమూరు పుంత రోడ్డులోకి తీసుకువెళ్లి, ముందే వేసుకున్న పథకం ప్రకారం హతమార్చాడని పోలీసులు చెబుతున్నారు.

బయటకు వెళ్లిన మానస ఎంతకూ ఇంటికి రాకపోవడంతో జ్యోతి ఈ నెల 20వ తేదీన పెద్దాపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై దర్యాప్తు ఆరంభించిన పోలీసులు అనుమానితుడిగా ఉన్న నానిని అదుపులోకి తీసుకుని, విచారణ చేపట్టేందుకు ప్రయత్నించారు. చివరకు అతడు పరారీలో ఉన్నాడని గుర్తించారు. మరోవైపు బాలిక ఆచూకీ కోసం కూడా గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో కట్టమూరు పుంతలో బాలిక మృతదేహాన్ని ఆదివారం రాత్రి గుర్తించిన స్థానికులు.. పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు అక్కడకు చేరుకున్నారు. అప్పటికే ఆ బాలిక మృతదేహం పూర్తిగా పాడైపోయింది. కుక్కలు ఈడ్చుకు రావడంతో గుర్తు పట్టలేని స్థితిలో ఉంది. చివరకు దుస్తుల ఆధారంగా ఆ మృతదేహం మానసదేనని గుర్తించారు. చిన్నారి మృతదేహానికి పెద్దాపురం ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి, బంధువులకు అప్పగించి, సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. మానస హత్యకు కారకుడైన నాని ఫొటోను పోలీసులు విడుదల చేశారు. అతడిని పట్టించిన వారికి రూ.10 వేల పారితోషికం అందిస్తామని ప్రకటించారు. డీఎస్పీ లతా కుమారి నేతృత్వంలో సీఐ అబ్దుల్ నబీ, ఎస్సై సురేష్‌లు ఈ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిందితుడి అరెస్టుకు ఆందోళన

మానసను హత్య చేసిన నానిని తక్షణమే అరెస్టు చేయాలని డిమాండు చేస్తూ స్థానిక కొత్తపేట పెట్రోల్ బంక్ గుర్రాల సెంటర్ వద్ద మానస కుటుంబ సభ్యులు, ఎన్‌టీఆర్ నగర్ వాసులు, ప్రజాసంఘాల ఆధ్వర్యాన సోమవారం ధర్నా నిర్వహించారు. రోడ్డుపై బైఠాయించి, నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సీఐ నబీ, ఎస్సై సురేష్‌లు సంఘటన స్థలానికి చేరుకుని నిందితుడి కోసం గాలింపు మొదలు పెట్టామని, త్వరలోనే అరెస్టు చేసి, కోర్టుకు అప్పగిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

• 'లక్ష'ణంగా.. 'లక్ష్మీ'గణపతిగా..



వేయి విఘ్నాలను తొలగించే ఆ గణాధిపతి.. సోమవారం 'లక్ష'ణంగా 'లక్ష్మీ' గణపతిగా దర్శనమిచ్చారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురం అగ్రహారం రామాలయం సమీపంలో ఈ అపురూప దృశ్యం ఆవిష్కృతమైంది. వరసిద్ధి వినాయక స్వామి వారిని, ఆ సన్నిధిని.. ఒకటీ రెండు కాదు.. ఏకంగా రూ.9 లక్షల కరెన్సీ నోట్లతో సోమవారం అలంకరించారు. గణపతి నవరాత్రుల సందర్భంగా ఉత్సవ నిర్వహణ కమిటీ ఆధ్వర్యాన స్వామివారిని ఇలా ముస్తాబు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.
– మలికిపురం

కోనసీమ పుణ్యక్షేత్రాలకు బస్సులు నడపాలి

- అన్నవరం దేవస్థానం అధికారులకు భక్తుల విజ్ఞప్తి
- రత్నగిరిపై డయల్ యువర్ ఈఓ కార్యక్రమం


డయల్ యువర్ ఈఓ కార్యక్రమంలో మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్ రమేష్‌బాబు

అన్నవరం: సత్యదేవుని సన్నిధికి కోనసీమ నుంచి భక్తులు వచ్చేందుకు వీలుగా అమలాపురం, ద్వారపూడి, వాడపల్లి తదితర ప్రాంతాలకు అన్నవరం నుంచి బస్సులు నడపాలని పలువురు భక్తులు కోరారు. దీనిపై దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ ఆజాద్‌తో చర్చించి తగు నిర్ణయం తీసుకుంటామని అసిస్టెంట్ కమిషనర్ (ఏసీ) డీఎల్‌వీ రమేష్‌బాబు తెలిపారు. ఈఓ ఆజాద్ క్యాంపులో ఉండటంతో రత్నగిరిపై ఆయన కార్యాలయం నుంచి సోమవారం ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకూ ఏసీ రమేష్‌బాబు డయల్ యువర్ ఈఓ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కోనసీమ పుణ్యక్షేత్రాలకు బస్సులు నడపాలని అమలాపురానికి చెందిన ఎస్.సత్యనారాయణ, ధర్మవరానికి చెందిన జి.సుబ్రహ్మణ్యం కోరారు. భక్తులను రత్నగిరికి చేర్చేందుకు దేవస్థానం బస్సులు నడుపుతున్నట్లు అన్నవరం రైల్వే స్టేషన్ మూడో నంబర్ ప్లాట్‌ఫాం వద్ద మైకులో చెప్పించాలని, దేవస్థానం టోల్‌గేట్ వద్ద స్థానికులకు టోల్ వసూలు చేయరాదని ఎ.కొత్తపల్లికి చెందిన ఎం.సురేష్ కోరారు. ఏలేశ్వరం సత్యదేవుని ఆలయం వద్ద భక్తులు వివాహాలు చేసుకునేందుకు వీలుగా ప్లాట్‌ఫాం నిర్మించాలని ఏలేశ్వరానికి చెందిన వి.మౌని కోరారు. అన్నవరం మెయిన్ రోడ్డులో దేవస్థానం నిర్వహణలోని విద్యుద్దీపాలు వెలగడం లేదని స్థానికుడు మురళి తెలిపారు. తమకు కానుకలు ఇవ్వాలంటూ రత్నగిరిపై ఎస్‌ఆర్‌సీ సత్రం వద్ద వివాహ బృందాలను హిజ్రాలు ఇబ్బంది పెడుతున్నారని, వారిని నియంత్రించాలని డాక్టర్ ఎ.సత్యనారాయణ కోరారు. దేవస్థానంలో భక్తుల వాహనాలు చోరీ అవుతున్నాయని స్థానికుడు ఎం.శ్రీనివాస్ తెలిపారు.

ఈ సమస్యలపై సంబంధిత అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామని ఏసీ రమేష్‌బాబు వారికి బదులిచ్చారు. దేవస్థానంలో ప్లాస్టిక్ నిషేధం అమలు కావడం లేదనే విమర్శలు వస్తున్నాయని సామర్లకోటకు చెందిన చైతన్య చెప్పగా.. అది నిజం కాదని ఏసీ రమేష్‌బాబు చెప్పారు. దేవస్థానంలో ప్లాస్టిక్ నిషేధం పక్కాగా అమలు చేస్తున్నామని, ఆగస్టు 15 నుంచి ప్లాస్టిక్ బాటిల్స్ కూడా నిషేధించామని, టోల్‌గేట్ వద్ద తనిఖీ చేసి రత్నగిరికి ప్లాస్టిక్ వస్తువులు తీసుకురాకుండా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. దేవస్థానంలో ధర్మప్రచార కార్యక్రమాలు నిర్వహించేందుకు పీఆర్‌ఓ విభాగాన్ని సంప్రదించాలని కేశనపల్లికి చెందిన అడపా నరసింహారావు అడిగిన ప్రశ్నకు ఏసీ జవాబిచ్చారు. కార్యక్రమంలో దేవస్థానం ఏఈఓ పి.జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

లఘు చిత్రానికి స్పెషల్ జ్యూరీ అవార్డు


స్పెషల్ జ్యూరీ అవార్డు అందుకుంటున్న మాణిక్యాలరావు

సీతానగరం: విజయవాడకు చెందిన తెలుగు షార్ట్ ఫిలిమ్స్ అసోసియేషన్ నిర్వహించిన రాష్ట్ర స్థాయి లఘు చిత్రాల పోటీలో రఘుదేవపురానికి చెందిన మైలవరపు మాణిక్యాలరావు చిత్రీకరించిన 'భూమి' లఘు చిత్రానికి స్పెషల్ జ్యూరీ అవార్డు లభించింది. విజయవాడలోని చుక్కపల్లి పిచ్చయ్య ఆడిటోరియంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో సినిమా దర్శకుడు వీరశంకర్ చేతుల మీదుగా మాణిక్యాలరావు ఈ అవార్డు అందుకున్నారు. నిత్యం బయటకు వెళ్లి జీవనం సాగిస్తున్న మహిళల అవస్థలు, ఎదుర్కొంటున్న పరిస్థితులను కళ్లకు కట్టినట్టు చిత్రించి, వాటిని ఏవిధంగా అధిగమించాలనే సందేశంతో భూమి చిత్రాన్ని ఆయన రూపొందించారు. మాణిక్యాలరావు సీతానగరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ల్యాబ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. గతంలో రాష్ట్ర మద్య విమోచన కమిటీ నిర్వహించిన జాతీయ స్థాయి లఘు చిత్ర పోటీల్లో మాణిక్యాలరావు రూపొందించిన 'మందు మానరా మిత్రమా' లఘు చిత్రం తృతీయ స్థానం దక్కించుకుంది. రాజమహేంద్రవరం షార్ట్ ఫిలిమ్ అసోసియేషన్ నిర్వహించిన ఉగాది పురస్కారాల్లో బహుమతి అందుకుంది. ఇదే స్ఫూర్తితో మరిన్ని లఘు చిత్రాలు రూపొందిస్తానని మాణిక్యాలరావు చెప్పారు. ఆయనను కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ దొరబాబు, లెక్చరర్లు, స్థానికులు అభినందించారు.

కార్యాలయం దహనం కేసులో 8 మంది అరెస్టు

అమలాపురం టౌన్: ఈదరపల్లిలో రౌడీషీటర్ పోలిశెట్టి రామకృష్ణ కిషోర్ హత్య, అదే గ్రామానికి చెందిన అడపా సాయి లక్ష్మణ్‌పై హత్యాయత్నం ఘటనల అనంతరం.. అమలాపురం ఎర్ర వంతెన సమీపంలోని రాయల్ రియల్ ఎస్టేట్ కార్యాలయాన్ని తగులబెట్టిన కేసులో పోలీసులు ఎనిమిది మందిని అరెస్టు చేశారు. అమలాపురం రూరల్ ఈదరపల్లికి చెందిన అడపా లక్ష్మణరావు, అడపా దివాకర సత్యప్రసాద్, అంబటి గిరీశ్వర్, నల్లమిల్లికి చెందిన సాధనాల హరీష్, చల్లా సాయి బద్రీనాథ్, ఇందుపల్లికి చెందిన లింగోలు సత్యనారాయణ, అయినవిల్లికి చెందిన నల్లా నాగబాబు, అమలాపురం పట్టణం సావరానికి చెందిన త్రిపురారి సాయి సూర్య జగదీష్‌లను అరెస్టు చేశారు. వారిని కోర్టులో హాజరు పరచి, రిమాండు నిమిత్తం రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించారు. నిందితుల నుంచి మూడు మోటారు సైకిళ్లు, మూడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ అంబికా ప్రసాద్ సోమవారం ఈ వివరాలు తెలిపారు. ఈ కేసులో ఇంకా కొంతమంది నిందితులను అరెస్టు చేయాల్సి ఉందని చెప్పారు. రౌడీషీటర్ పోలిశెట్టి రామకృష్ణ కిషోర్ హత్య ఉదంతంలో తెర వెనుక కొందరి పాత్ర ఉందనే అనుమానంతో అతడి వర్గీయులు ఎర్ర వంతెన వద్ద టీడీపీ నేతకు చెందిన కార్యాలయాన్ని దహనం చేశారు. ఈదరపల్లిలోని బళ్ల సతీష్ ఇంటిని ధ్వంసం చేశారు. బళ్ల సతీష్ ఇంటిని ధ్వంసం చేసిన ఘటనలో రియల్ ఎస్టేట్ కార్యాలయం దహనం కేసులో నిందితులైన అడపా లక్ష్మణరావు, అడపా దివాకర సత్యప్రసాద్ కూడా బాధ్యులని, వారిపై పీటీ వారెంట్ జారీ చేసి, కోర్టు ముందు హాజరు పరుస్తామని డీఎస్పీ చెప్పారు. రావులపాలెం సీఐ ఎస్.రజనీకుమార్ బృందం ఈ కేసు దర్యాప్తు చేస్తోందని చెప్పారు.

జెడ్పీ చైర్మన్‌కు సత్కారం


జెడ్పీ చైర్మన్ విప్పర్తిని సత్కరిస్తున్న ఉద్యోగులు

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిషత్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావును ఉద్యోగులు సోమవారం సత్కరించారు. కేక్ కట్ చేసి పంచారు. జిల్లాలో దీర్ఘకాలికంగా ఉన్న అనేక సమస్యలు పరిష్కరించడంతో పాటు ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి వేణుగోపాలరావు కృషి చేస్తున్నారని అన్నారు. జిల్లా అభివృద్ధికి సమన్వయంతో కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ఎ.రమణారెడ్డి, ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఆర్‌వీవీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మీకి ఏడుగురు విద్యార్థుల ఎంపిక

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు ఏడుగురు భారత ఆర్మీకి ఎంపికయ్యారు. వీరు అగ్నిపథ్ ద్వారా సైన్యంలో ప్రవేశం పొందారని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామచంద్రయ్య సోమవారం తెలిపారు. కళాశాలలో ఎన్‌సీసీ శిక్షణ పొందుతూ తృతీయ సంవత్సరం పూర్తి చేసిన పల్లి సత్యనారాయణ, అల్లు రాజేష్, ద్వితీయ సంవత్సరం పూర్తి చేసిన గోపి, జేసీ శివాజీ, తంగుడు సంతోష్‌కుమార్, ప్రథమ సంవత్సరం పూర్తి చేసిన డైరి గోవిందరావు, ఎం.మహేంద్ర ఎస్.జీవన్‌కుమార్‌లు ఆర్మీలో కొలువు సాధించారని వివరించారు. అలాగే, తృతీయ సంవత్సరం పూర్తి చేసిన కటారి పవన్ సీఆర్‌పీఎఫ్‌కు, జి.రోహిత్, కొండ్రు అబ్రహం కెనడీలు సీఐఎస్‌ఎఫ్‌కు ఎంపికయ్యారని తెలిపారు. కళాశాలలో నేర్చుకున్న విలువలను పాటిస్తూ దేశ సమగ్రత, గౌరవాన్ని కాపాడుతూ, విధులు నిర్వర్తించాలని ఎంపికైన విద్యార్థులకు రామచంద్రయ్య సూచించారు. కళాశాలలో ఎన్‌సీసీ శిక్షణ ద్వారా ఈ ఉద్యోగాలు సాధించామని ఎంపికైన విద్యార్థులు ఈ సందర్భంగా తెలిపారు. వీరిని ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ డాక్టర్ ఈసూల్ బాషా షేక్ ప్రత్యేకంగా అభినందించారు.